క్లుప్తంగా

అమ్మవారిని దర్శించుకున్న అర్జున్ రెడ్డి



అమ్మవారిని దర్శించుకుంటున్న అర్జున్‌రెడ్డి

ప్యాపిలి: మాజీ మంత్రి తనయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు బుగ్గన అర్జున్ అమర్‌నాథ్ రెడ్డి సోమవారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని సందర్శించారు. ఆర్యవైశ్యులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. ఆర్యవైశ్య సంఘం నేత రాజా మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

మ్యాన్యువల్ కౌన్సెలింగ్ చేపట్టాలి

కోవెలకుంట్ల: ఇటీవల డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు మ్యానువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొత్తగా ఉద్యోగంలో చేరే ఉపాధ్యాయులకు వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన ఉండదన్నారు. ఈ ప్రక్రియలో పొరపాట్లు జరిగే అస్కారం ఉందని, వారి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మ్యానువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. అలాగే ఇది వరకే ఉద్యోగాలు చేస్తూ ముందస్తు అనుమతితో పరీక్ష రాసి ఎంపికైన వారికి పే ప్రొటెక్షన్ కల్పించి నిల్వ ఉన్న సెలవులను కొనసాగించాలని పేర్కొన్నారు.

భూ సమస్యలకు రీసర్వేతో పరిష్కారం



బొందలదిన్నెలో గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్

సంజామల: భూ సమస్యలకు రీసర్వేతో పరిష్కారం లభిస్తుందని, రైతులు సహకరించాలని తహసీల్దార్ అనిల్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని కమలపురి, బొందలదిన్నె గ్రామాల్లో సోమవారం రీసర్వే అంశంపై ర్యాలీ, గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. అక్టోబర్ 3వ తేదీ నుంచి రీసర్వే ప్రారంభం అవుతుందని తెలిపారు. పొలాల హద్దులను నిర్ణయించి శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. రైతులకు నోటీసులు అందించినప్పుడు పొలం దగ్గర హద్దులు చూపిస్తే సర్వే త్వరగా అయిపోతుందన్నారు. కార్యక్రమంలో డీటీ తులసీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నివాళి

బనగానపల్లె: పట్టణంలోని సయ్యద్‌వాడీ కాలనీకి చెందిన వీరభద్రస్వామి ఆలయ పూజారి తంబళ్ల సుబ్రమణ్యం(65) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కాలనీకి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శి సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ అవుకు కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

11 కేవీ విద్యుత్ లైన్ మార్పునకు వినతి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బేతంచెర్ల: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఇళ్లపైన, వీధుల్లో ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్ మార్పు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ మేరకు సోమవారం విద్యుత్ శాఖ ఏడీ మధుసూదన్ రెడ్డి, టౌన్ ఏఈ శివన్నకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఏడీ, ఏఈలు కాలనీని సందర్శించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బ్రహ్మానాయుడు, ఖలీల్, ఫక్రుద్దీన్, రాజు, వెంకట రామయ్య, సురేష్ ఉన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

సంజామల: మండలంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. సోమవారం నుంచి 11 సచివాలయాల పరిధిలో 12,282 కొత్త రేషన్ కార్డులను ఆయా వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది ప్రజలకు పంపిణీ చేస్తున్నారని తహసీల్దార్ అనీల్ కుమార్ తెలిపారు. నూతన రేషన్ కార్డులను ప్రతి ఒక్కరికీ అందిస్తామన్నారు.

ఇద్దరికి కారుణ్య నియామకాలు

డోన్: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు మున్సిపాలిటీలో కారుణ్య నియామకాల కింద ఉపాధి కల్పించినట్లు కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన నియామకపత్రాలను సోమవారం ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తన క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలం

- గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- భవిష్యత్ మనదే
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి





సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీకి అండగా ఉంటున్నారని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం కాటసాని స్వగృహంలో పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. అవుకు, బనగానపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, సన్నల జనార్ధన్‌రెడ్డి, ఎంపీపీ మానస వీణ, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏ పార్టీకి అయినా కార్యకర్తలే మూలస్తంభమని, వారు లేనిదే ఏ పార్టీ ఉండదన్నారు. ప్రతి గ్రామంలో అంకితభావంతో పనిచేసే కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ముఖ్యంగా రైతు, మహిళా, యువజన సంఘాలు ఏర్పాటు చేసి, వాటిలో చేరిన ప్రతి ఒక్కరికి డిసెంబరు 15 తర్వాత గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కొన్ని తప్పులు జరిగాయని, ఇకపై అలాంటి తప్పులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

డిజిటల్ బుక్‌తో కార్యకర్తలకు భరోసా

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులపై తప్పుడు కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కానీ గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎవరి మీదా తప్పుడు కేసులు పెట్టలేదని, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో అన్యాయం జరిగితే, అక్రమ కేసులు పెడితే, కార్యకర్తలు డిజిటల్‌బుక్ యాప్‌లో వాటిని నమోదు చేయాలని సూచించారు. అక్కడ నమోదు చేసిన వివరాల ఆధారంగా భవిష్యత్తులో జగన్ 2.0లో తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం అధికార పార్టీకి వత్తాసు పలికే అధికారులు, కూటమి నాయకులు చట్టం ముందు తప్పనిసరిగా నిలబడతారని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయి కమిటీల ఏర్పాటుకు సంబంధించిన పత్రాలను కార్యకర్తలకు అందజేశారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, గాలిహనుమంతరెడ్డి, తులసిరెడ్డి, శివారెడ్డి, జనార్ధన్‌రెడ్డి, అనిల్, సుదర్శన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, ప్రతాప్ యాదవ్, సాంబశివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సంజీవ గౌడ్, బత్తుల రామ్మోహన్‌రెడ్డి, చిన్నపురెడ్డి, రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌నాయక్, సురేష్, లారీ కరీమ్, సయ్యద్ హైదర్ నవాబు, సాదక్ హుస్సేన్, మోహన్‌రెడ్డి, గౌస్, దేవుడు, శ్రీనివాసులు, రఘునాథ్‌రెడ్డి, బాలపక్కిర, సంటెన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

బేతంచెర్ల: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండేందుకే డిజిటల్ బుక్ తీసుకొచ్చినట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, నాయకులు మూర్తుజావలి, ఖాజా అన్నారు. సోమవారం బేతంచెర్ల పార్టీ కార్యాలయంలో రాష్ట్ర యువజన కార్యదర్శి మురళీధర్‌రెడ్డి, మండల, పట్టణ కన్వీనర్లు తిరుమలేశ్వర్ రెడ్డి, పిట్టల జాకీర్‌తో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలపై, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎక్కడైన పార్టీ శ్రేణులపై కూటమి నేతలు దాడులు చేస్తే డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అండగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు మధు, ఇబ్రహీం, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో మాజీ చైర్మన్ నారాయణ, నాయకులు గూని నాగరాజు, వెంకిరెడ్డి, ధరణి కుమార్, శ్రీకాంత్, హుసేన్ బాషా, పవన్ కుమార్, ఎద్దులన్న, ముస్తఫా, అల్తాఫ్ హుస్సేన్, శ్రీనివాసులు, భాస్కర్, రమేష్, ఆనంద్, నాగేశ్వరరావు, కృష్ణయ్య, బ్రహ్మానాయుడు పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, నాయకులు

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



బేతంచెర్ల: దాతలను సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు



బనగానపల్లె: విరాళం అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాల ఆలయాభివృద్ధికి సుబ్రమణ్యం, లక్ష్మీదేవి దంపతుల కొడుకు, కోడలు సూర్య బళ్లాని, సింధు రూ. లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు గుండా గోపాలు, కంద గడ్డల జనార్దన్,ఆర్యవైశ్యులు బచ్చు సుబ్రమణ్యం, రామ్మూర్తి, తదితరులు దాతలతో అమ్మవారికి ప్రత్యేకపూజలు చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

చౌడేశ్వరి ఆలయానికి రూ.60 వేలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఇదే గ్రామానికి చెందిన రేగుబాల కుల్లాయి,వెంకటలక్ష్మమ్మ దంపతులు రూ. 60 వేల విరాళం ఇచ్చారు. సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు, ఆలయాభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో విరాళం అందజేశారు. ఆలయ సిబ్బంది వారిని దుశ్శాలువాతో సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

యాగంటి ఆలయానికి రూ.29 వేలు

యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి యాగంటిపల్లె గ్రామానికి చెందిన తలారి మనోహర్, సుజాత దంపతులు రూ.29,200 విరాళాన్ని సోమవారం అందజేసినట్లు ఆలయ అర్చకులు మహేశ్వరశర్మ, సిబ్బంది తెలిపారు. ఈ మేరకు దాతలకు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలతో సత్కరించారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

డోన్: స్థానిక పాతపేటలోని పెద్దమ్మ ఆలయం వద్ద హిందూ శ్మశానవాటికకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్నందున, ఆ రహదారిని ప్రాధాన్యత క్రమంలో పునర్నిర్మించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డీఈ రఘు, ఏఈ సురేష్ తెలిపారు. మొదటి దశలో రూ.12 లక్షల వ్యయంతో రహదారికి ఇరువైపులా నూతన డ్రైనేజీ నిర్మిస్తున్నామన్నారు. ఈ ప్రాంతం పురాతనమైనదని, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ నిర్మాణానికి సాధారణ నిధులను వినియోగిస్తున్నామని వివరించారు. వైస్‌చైర్మన్ జాకీర్ హుసేన్, కౌన్సిలర్ కటిక వేణు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కురుకుందు హరి, వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, వంశీ ఉన్నారు.

అన్నదానం

డోన్: దసరా నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక పాతబస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ సన్నిధి వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎలాంటి సౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



సర్వసభ్య సమావేశంలో మాట్లడుతున్న ఎంపీపీ పోచా రమాదేవి

సంజామల: ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ పోచా రమాదేవి సూచించారు. సంజామల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ, ఎంపీడీఓ సాల్మన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు నివేదికలు సమర్పించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించిందని, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతున్నారని, కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆకుమల్ల ఎస్సీ మాదిగపేటలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తహసీల్దార్ అనీల్‌కుమార్, వైస్ ఎంపీపీ చిన్నబాబు, రాజశేఖర్‌రెడ్డి, వ్యవసాయ అధికారి భూమజ్యోతి, ఏపీఎం గురుస్వామి, ఏపీఓ రవి ప్రకాశ్, సర్పంచ్ గుండం రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, కోఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యతో భవిష్యత్‌కు బంగారు బాట

డోన్ టౌన్: వృత్తి విద్యా కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలాంటివని జిల్లా వృత్తి విద్యా కోఆర్డినేటర్ సుధీర్‌బాబు అన్నారు. దసరా సెలవుల సందర్భంలో వృత్తి విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ఇస్తున్నారు. సోమవారం ఆయా ప్రదేశాలను ఆయన పరిశీలించారు. పట్టణంలోని మెకానిక్ షాపులు, ఇంటర్నెట్ సెంటర్లలో విద్యార్థుల పనితీరును ఆరా తీశారు. ఎలక్ట్రానిక్స్, ఐటీ వంటి కోర్సులకు 10 రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రత్యక్ష శిక్షణ ద్వారా విద్యార్థులు నైపుణ్యం సంపాదించి జీవితంలో రాణించగలరని తెలిపారు.



బైక్ మెకానిక్ షాప్ వద్ద విద్యార్థుల పనితీరుపై ఆరా తీస్తున్న సుధీర్‌బాబు

అమ్మవారి సేవలో కాటసాని

అవుకు(కొలిమిగుండ్ల): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అవుకు పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వరి ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి దర్శించారు. అమ్మవారికి పూజలు చేశారు. సోమవారం మూలనక్షత్రంలో భాగంగా అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కాటసాని ఆలయానికి చేరుకోగానే ఆర్యవైశ్య సంఘం నాయకులు స్వాగతం పలికారు.



అమ్మవారిని దర్శించుకున్న కాటసాని

● సరస్వతీ.. నమస్తుభ్యం



కొండపేటలో పూజలు చేస్తున్న భక్తులు

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు చదువుల తల్లి సరస్వతీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. తమ పిల్లలు విద్యలో రాణించేలా దీవించాలని ప్రార్థించారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నందవరం చౌడేశ్వరిదేవి మహాగౌరి అలంకరణలో కనువిందు చేశారు. మద్దిలేటి లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలోని మహాలక్ష్మి దేవి లలితాదేవిగా పూజలందుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



మహాగౌరిగా నందవరం చౌడేశ్వరిదేవి



సరస్వతిదేవిగా కన్యకాపరమేశ్వరి



కోవెలకుంట్ల: సరస్వతి దేవిగా వాసవీమాత



కోవెలకుంట్ల: గౌరీదేవిగా ప్రసన్నభారతీ



డోన్: అమ్మవారిశాలలో సరస్వతిదేవి



బేతంచెర్ల: మహాచండీగా వాసవీ మాత



కొత్తపేటలో దుర్గామాత



బేతంచెర్లలో చంద్రప్రభ వాహనంపై వేంకటేశ్వరుడు



బేతంచెర్ల: మయూర వాహనంపై అమ్మవారు



మద్దిలేటిస్వామి ఆలయంలో సింహవాహనంపై..



ప్యాపిలిసరస్వతిదేవిగా వాసవీమాత



సంజామలలో సరస్వతిదేవి

డ్రైనేజీ కాలువల్లో చెత్త వేయొద్దు



కాలువలో మందు పిచికారీ చేస్తున్న కమిషనర్

బేతంచెర్ల: పట్టణ ప్రజలు కాలువల్లో చెత్త వేయకుండా తడి, పొడి చెత్తను వేరు చేసి నగర పంచాయతీ సిబ్బందికి అందజేయాలని కమిషనర్ హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలోని అంగళ్ల బజారులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ సహరించాలని కోరారు. అనంతరం కాలువల్లో దోమల నిర్మూలనకు మందు పిచికారీ చేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కందగడ్డల జనార్దన్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గుండా అశ్వర్థ నారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఆయుధ పూజ



ట్రాన్స్‌ఫార్మర్‌కు పూజలు చేస్తున్న సిబ్బంది

డోన్ టౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా దుర్గాష్టమిని పురస్కరించుకుని సోమవారం మండలంలోని యు.కొత్తపల్లె సబ్‌స్టేషన్‌లో ఆయుధ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఏఈ నాగేశ్వరరెడ్డి, సిబ్బందితో కలిసి దుర్గామాత చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌లోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలకు ఆయుధ పూజ చేపట్టారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, లైన్‌మన్ వెంకటేశులు, జేఎల్ఎం సిద్ధయ్య, ఆపరేటర్లు సాయి పురుషోత్తం, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్లకు 62 మెట్రిక్ టన్నుల జిప్సం

బేతంచెర్ల: మండలానికి 62 మెట్రిక్ టన్నుల జిప్సం మంజూరైనట్లు ఏఓ విజయ కుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. 50 కేజీల జిప్సం రూ.250 కాగా సబ్సిడీ పోను రైతులు రూ.123.50 చెల్లించాల్సి ఉంటుందన్నారు. చౌడు నేలలు బాగు చేయడానికి, వేరుశనగ పంటలో గింజ నాణ్యత, నూనె శాతం అధికంగా రావడానికి ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. ఆరేళ్ల తర్వాత మండలానికి జిప్సం వచ్చిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులందరూ తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో బిందెసేవ



బిందె సేవలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

అవుకు(కొలిమిగుండ్ల): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం అవుకులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బిందెసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలోని శివాలయం వద్దకు ఆర్యవైశ్యులు, మహిళలు చేరుకుని పూజలు చేశారు. వాసవీ మాతను పెల్లికాని ఆర్యవైశ్య యువకులు మోసుకుంటు రాగా మేళతాళాలు, మహిళలు నృత్యం చేస్తూ అమ్మవారికి స్వాగతం పలికారు. అమ్మవారిశాలకు చేరుకుని వాసవీమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎంపీపీకి సత్కారం



ఎంపీపీని సత్కరిస్తున్న గంగాధర్

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన వల్లెపు గంగాధర్ ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ విభాగంలో 87.22 మార్కులు సాధించి ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా చదువులకు స్వస్తి పలకాలనుకున్న తరుణంలో అతని ప్రతిభను చూసి ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి రూ. 30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన అందించిన తోడ్పాటుతోనే టీటీసీ పూర్తి చేసి డీఎస్సీ ప్రతిభలో చాటినట్లు గంగాధర్ తెలిపారు. తనకు అండగా నిలిచిన ఎంపీపీని సోమవారం శాలువతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.

పగబట్టిన వరుణుడు



కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో వర్షాలు వీడటం లేదు. కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఇటీవల మూడు రోజులపాటు మోస్తరు నుంచి భారీవర్షాలు కురిశాయి. ఆదివారం మాత్రం వర్షం తెరపి ఇచ్చి కాస్త ఎండకాచింది. సోమవారం ఉదయం నుంచి ఎండతీవ్రత అధికంగా ఉండి సాయంత్రానికంతా వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని మోస్తరు వర్షం కురిసింది. వరుస వర్షాలతో పొలాల్లో వర్షపునీరు చేరి సాగుకు ఆటంకం ఏర్పడడంతో పది రోజుల నుంచి వివిధ పంటల సాగు డీలా పడింది. ఈ నెలాఖరుతో ఖరీఫ్ సీజన్ ముగియనుండగా ఇప్పటికే జొన్న సాగుకు ఆటంకం ఏర్పడింది. వచ్చే నెల 1వ తేదీ నుంచి రబీ సీజన్ ప్రారంభం కానుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.